ప్రజాశక్తి

గురువారం 27 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం

ప్రమాద బీమా నమోదుకు గడువు పెంపు

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రమాద బీమా కోసం కార్మికులు తమ పేర్లను ఇ-శ్రమ పోర్టల్‌లో నమోదు చేసికోవడానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు ఇన్‌ఛార్జి జిల్లా కార్మిక శాఖ అధికారి జి.ఎల్లాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 26 ఆగస్టు 2021 నుంచి 31 మార్చి 2022 వరకు జరిగిన ప్రమాద బాధితులు నమోదు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 9492555023 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్మికుల రక్షణకు యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కర్మాగారాలు, దుకాణాలు, సంస్థలలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, వలసకూలీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

అంపశయ్యపై సర్కారు వైద్యం

చికిత్స పొందుతున్న రోగులు (ఫైల్)

- దవాఖానాల్లో వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- పిహెచ్‌సిల్లో ఒకే డాక్టర్‌తో నెట్టుకొస్తున్న వైనం
- పనిఒత్తిడితో బెంబేలెత్తిపోతున్న వైద్యాధికారులు
- ముంచుకొస్తున్న ఎపిడిమిక్ సీజన్

ప్రజాశక్తి-సీతంపేట

ఏజెన్సీలో మరికొద్ది రోజుల్లో ఎపిడిమిక్ సీజన్ ప్రారంభం కానుంది. ఏటా మన్యంలో అధికంగా మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు విజృంభిస్తాయి. దీనిని ఎదుర్కోవాలంటే వైద్యులు, సిబ్బందితో పాటు మందులు కూడా పూర్తిస్థాయిలో ఉండాలి. కానీ ఏజెన్సీలోని ప్రభుత్వ దవాఖానాలు వైద్యులు, సిబ్బంది కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. సీతంపేట ఐటిడిఎ పరిధిలోని ఆస్పత్రుల్లో వైద్యుల కొరతే అందుకు నిదర్శనం. ఐటిడిఎ పరిధిలో 31 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 11 వైద్యాధికారి పోస్టులు ఖాళీలు ఉన్నాయి. కుసిమి, దోనుభాయి పిహెచ్‌సిలు ఖాళీగా ఉన్నాయి. మిగతా 9 పిహెచ్‌సిలో ఉన్నత చదువుల కోసం వైద్యులు వెళ్లిపోయారు.

ఈ నెలాఖరికి భర్తీకి చర్యలు

వైద్యుల పోస్టుల నియామకం ప్రస్తుతానికి ప్రాసెస్‌లో ఉంది. ఈ నెలాఖరుకల్లా వైద్యుల పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటాం. సకాలంలో గిరిజనులకు వైద్య సేవలు అందిస్తాం.

- సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పిఒ, సీతంపేట ఐటిడిఎ

'గిరిజనుల వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాం. కార్పొరేట్ తరహాలో మల్టీ స్పెషాలిటీ వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలు చేపడుతున్నాం. మీ ప్రాంతంలోనే మీకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామ'ంటూ మన పాలకులు గొప్పలు చెబుతున్నారు. కానీ ఆచరణలో మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రభుత్వాలు మారినా పనితీరు మారలేదు. ఆస్పత్రిలో సరిపడా వైద్య అధికారులు, సిబ్బంది లేకపోవడంతో వైద్యానికి రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. 24 గంటలూ పనిచేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఒక్కొక్క డాక్టర్‌తోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఉన్న వైద్యులపై పనిఒత్తిడి పెరగడంతో బెంబేలెత్తిపోతున్నారు.

సీతంపేటలో 30 పడకల నుంచి వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి ఆరేళ్లు కావస్తోంది. ఈ ఏరియా ఆస్పత్రి సీతంపేట ఏజెన్సీకే కాకుండా భామిని, కొత్తూరు, హిరమండలం, ఆ సమీపంలో ఉన్న ఒడిశాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు పెద్దదిక్కు. అయితే ఇప్పటికీ జనరల్ వైద్యుల పోస్టులు నాలుగు ఖాళీ ఉండటంతో ఉన్న వైద్యులపైనే భారం పడుతోంది. డెర్మటాలజిస్ట్, మత్తు వైద్యులు, సివిల్ సర్జన్, సిఎస్ఆర్ఎం పోస్టులు ఖాళీ ఉండటంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దీంతోపాటు స్టాఫ్ నర్స్ పోస్టులు ఏడు ఖాళీలు ఉన్నాయి ఎన్ఆర్‌సిలో ఇద్దరు వైద్యాధికారులు, స్టాఫ్‌నర్స్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. ఇంకా జనరల్ డ్యూటీ అటెండర్ పోస్టులు ఐదు ఖాళీ ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్, ఎక్స్‌ట్రా టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ పోస్టులు ఖాళీలు ఉండటంతో ఆ సేవలకు కొన్ని సందర్భాల్లో అంతరాయం కలుగుతోంది. వంద పడకల ఆస్పత్రికి తగ్గట్టుగా శానిటేషన్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది లేరు.

☞ దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 20 పంచాయతీల వరకు ఉన్నాయి. అక్కడి గిరిజనులకు పిహెచ్‌సినే దిక్కు. అలాంటిది ఏడాదిపైగా పిహెచ్‌సిలో వైద్యాధికారి పోస్టు భర్తీ చేయలేదు. ఉన్న ఒకే వైద్యాధికారితో నెట్టుకొస్తున్నారు. ఆ ప్రాంతంలో అధికంగా మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదు అవుతాయి. గత ఏడాది అధికంగా ఈ కేసులు వచ్చాయి. ఇక వైద్య సిబ్బంది కొరతా వేధిస్తోంది.

☞ కుసిమి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులకు ఒకరు ఉద్యోగోన్నతిపై వెళ్లిపోయారు. ప్రస్తుతం ఒక్కరితోనే నెట్టుకొస్తున్నారు. ఈ పిహెచ్‌సికి రోగుల తాకిడి ఉంటుంది. ఎఎన్ఎం పోస్టులు రెండు ఖాళీలు ఉన్నాయి.

సీతంపేట ఏరియా ఆస్పత్రి

మల్టీపర్పస్ హెల్త్ సూపర్వైజర్ (మేల్) పోస్టు భర్తీ చేయాల్సి ఉంది.

☞ మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.. చుట్టుపక్కల సుమారు 20 పంచాయతీల గిరిజనులకు ఆధారం. ఇద్దరు వైద్యాధికారులకు ఒకరు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ప్రస్తుతం ఒక వైద్యాధికారితో నెట్టుకొస్తున్నారు. ఎపిడిమిక్ సీజన్లో రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. నాలుగు సూపర్‌వైజర్ పోస్టులకు మూడు ఖాళీలు ఉన్నాయి.

☞ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటలూ పనిచేసేలా రూపొందించారు. ఉన్న ఇద్దరు వైద్యులు సరిపోవడం లేదు. ఎందుకంటే ఒక వైద్యాధికారి ఆస్పత్రిలో ఒపి చూస్తే, మరో వైద్యాధికారి 104 వాహనం ద్వారా నెలకు 20 రోజులు గ్రామాలను సందర్శిస్తారు. మరో వైద్యాధికారి వైద్య శిబిరాలు, అధికారుల సమావేశాలు, పాఠశాల సందర్శనకు హాజరుకావాలి. ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కనీసం ముగ్గురు వైద్యులైనా ఉండాలన్న అభిప్రాయాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

ఎసిబి వలలో అవినీతి తిమింగలం

- చేప పిల్లల సరఫరా బిల్లుకు రూ.60 వేలు డిమాండ్
- జిల్లా మత్స్యశాఖాధికారిని పట్టించిన సీడ్ సరఫరా యజమాని

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య బుధవారం 60 వేల రూపాయల లంచం తీసుకుంటూ ఎసిబి అధికారుల చేతికి చిక్కారు. డిఎస్‌పి రమణమూర్తి ఆధ్వర్యాన అధికారులు పట్టుకున్నారు. జిల్లాలోని చెరువులు, జలాశయాల్లో చేపపిల్లల పెంపకానికి పాలకొండ మండలం టిడి పారాపురం గ్రామానికి చెందిన శ్రీకోటదుర్గ సీడ్స్ కంపెనీ యజమాని బొప్పాడ అప్పన్నదొర రూ.6 లక్షల విలువైన చేపపిల్లలను సరఫరా చేశారు. దీనికి గాను జిల్లా మత్స్యశాఖ అధికారి ద్వారా 6 లక్షల రూపాయల బిల్లు మంజూరు కావాల్సి ఉంది. ఈ బిల్లు మంజూరు చేయాలని చేపపిల్లల సీడ్ కంపెనీ యజమాని అప్పన్నదొర అడుగుతుండగా, తనకి పది శాతం కమీషన్ కావాలని మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య డిమాండ్ చేశారు. దీంతో అప్పన్నదొర ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి అధికారులు వలపన్ని చాకచక్యంగా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య రూ.60 వేలు లంచం తీసుకుంటున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. పార్వతీపురం మన్యం ఏర్పడిన తర్వాత జిల్లా స్థాయి అధికారి ఎసిబి వలలో చిక్కడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

ఎసిబి అధికారులకు పట్టుబడిన జిల్లా మత్స్యశాఖాధికారి తిరుపతయ్య

16.90 శాతం జిల్లా వృద్ధిరేటుపై

కలెక్టర్‌కు సిఎం ప్రశంస

- పిపిపి పర్సెప్షన్‌లో జిల్లాకు 4వ ర్యాంకు పట్ల అభినందన
- సమస్యల పరిష్కారానికి అధికారులకు సిఎం ఆదేశాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో 16.90 శాతం వృద్ధి రేటు సాధించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను ప్రశంసించారు. పార్వతీపురం మన్యం జిల్లా వృద్ధి రేటును అన్ని జిల్లాలు ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి తెలిపారు. పిపిపి పర్సెప్షన్‌లో జిల్లా 4వ ర్యాంకులో ఉండటం పట్ల అభినందించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సదస్సు సిఎం అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగింది. బుధవారం రెండో రోజు జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా కలెక్టర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో చేపట్టిన, చేపడుతున్న ప్రగతిని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాల్సి ఉందని తెలిపారు. కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల పనులు 60 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు కావాల్సి ఉందన్నారు. లాబేసు - పూర్ణపాడు వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉందని, తద్వారా 19 గ్రామాలకు రహదారి సౌకర్యం లభిస్తుందని కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ చర్యలకు ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం వ్యవసాయం రంగం నుంచి, 9 శాతం పారిశ్రామిక రంగం నుంచి, 41 శాతం సేవా రంగం నుంచి జిడిపి వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలు కచ్చితంగా అమలు చేస్తూ మరింత వృద్ధి సాధించుటకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు.

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎపిడిపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్

ప్రజాశక్తి- పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో ఎపిడి వై.సత్యంనాయుడు పనిచేసిన కాలంలో కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకవైపు పాలకొండ సబ్‌కలెక్టర్ దర్యాప్తు చేస్తుండగా ఇంకోవైపు ఎపిడిపై గతంలో ఫిర్యాదులు చేసిన వారి వద్దకు వెలుగు ఉద్యోగులు వెళ్లి బెదిరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మూడున్నర సంవత్సరాలుగా ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అనేక రూపాల్లో నిధులు దారిమళ్లించినట్లు పలుసార్లు ఫిర్యాదులు చేశామని చెప్పారు. కేంద్రప్రభుత్వం ఐటిడిఎ పరిధిలోని విడివికెలకు మంజూరు చేసిన నిధులతో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు, గిరిజనుల నుంచి జీడి, చింతపండు, పసుపు వంటి ఉత్పత్తులు కొనుగోలు చేసినట్లు తప్పుడు నివేదికలు అందజేశారని తెలిపారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన యంత్రాల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామస్వామి, జిల్లా నాయకులు కె.సాంబమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

డిఆర్‌డిఎ పీడీకి ఫిర్యాదు

పార్వతీపురంరూరల్ : రావికోన గ్రామానికి వెలుగు విఒఎని వెంటనే నియమించాలని, ఎపిడిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.రామస్వామి.. బుధవారం డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణికి వినతి అందించారు. 18 నెలలుగా విఒఎను నియమించకుండా రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఎపిడి, ఎపిఎం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంపై గతంలో అనేకసార్లు జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదని చెప్పారు. వెలుగు ఎపిడి ఖర్చుపెట్టిన నాలుగేళ్ల నిధులపై, కార్యాలయాలకు కొనుగోలు చేసిన యంత్రాలు, సామగ్రి, ధాన్యం కొనుగోలు నేపథ్యంలో 2019 చెల్లించాల్సిన కమీషన్‌పై సమగ్ర దర్యాప్తు చేపట్టాని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు రామారావు పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయాలు షురూ

చైర్మన్ కుర్చీ కోసం వైసిపి, టిడిపి పట్టు

పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మున్సిపాలిటీలో టిడిపి, వైసిపి క్యాంపు రాజకీయాలు మొదలెట్టాయి. చైర్మన్ కుర్చీ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పట్టు కోసం తాజా, మాజీ ఎమ్మెల్యేలు బోనెల విజయ్‌చంద్ర, అలజంగి జోగారావు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందో, వీగుతుందో అనే ఆత్రుతతో పట్టణ ప్రజలతోపాటు ఇరు పార్టీల నాయకులు ఎదురుచూపులు చూస్తున్నారు. చైర్మన్ కుర్చీని దక్కించుకోవాలనే ప్రయత్నంలో భాగంగా స్థానిక టిడిపి ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర.. వైసిపి నుంచి గెలిచిన 22 మంది కౌన్సిలర్లలో 13 మందిని దశలవారీగా టిడిపిలో చేర్చుకున్నారు. ఈ చేరికలతో టిడిపి బలం 18కి చేరుకుంది. ఇంకా ఇద్దరు కౌన్సిల్ సభ్యులు టిడిపిలో చేరితే చైర్మన్, రెండు వైస్ చైర్మన్ పదవులు టిడిపి వశమవుతాయి.

టిడిపి నుంచి గెలిచిన ఐదుగురు కౌన్సిలర్లు, పార్టీలో చేరిన 13 మంది వైసిపి సభ్యులు అవిశ్వాస తీర్మానం నోటీసులను జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు ఇప్పటికే అందజేశారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లు చేజారిపోకుండా చూసుకునేందుకు 18 మందినీ టిడిపి క్యాంపు రాజకీయం మొదలెట్టింది. వైసిపిలో మిగిలిన 12 మంది కౌన్సిలర్లను వేరే చోటికి తరలించడం విశేషం. అవిశ్వాసంలో నెగ్గేందుకు తాజా, మాజీ ఎమ్మెల్యే ఎవరి దారిలో వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కలెక్టర్ పర్యవేక్షణలో త్వరలో జరిగే అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందో, వీగుతుందో చూడాల్సి ఉంది.

ధ్వంసం చేసిన దుకాణ సముదాయాలు, పెదమేరంగి ప్రాంతంలో ప్రధానరహదారిపై సంచరిస్తున్న ఏనుగులు

ఏనుగుల బీభత్సం

- రోడ్లపైకి వస్తున్న గజరాజులు
- ప్రజల్లో భయాందోళన

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామంలోకి మంగళవారం రాత్రి ప్రవేశించాయి. దుకాణ సముదాయాలు, కూరగాయల షాపులపై దాడి చేసి, ధ్వంసం చేశాయి. రాత్రి వేళలో ప్రధాన రహదారిపై అడవి ఏనుగుల సంచారంతో ప్రజలు, వాహనదారులు , రైతులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. రాత్రిపూట బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎంత వేడుకొన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

గడువులోగా రెవెన్యూ సేవలు అందించాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రెవెన్యూ శాఖ ద్వారా అందించే అన్ని సేవలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. మండలంలో రీసర్వే పైలట్ గ్రామం గోపాలపురంలో పురోగతిపై పిఒ బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్షించారు. గ్రామసభ నిర్వహించి రైతులందరూ గ్రౌండ్ వాలిడేషన్ సమయంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత ఫీల్డ్‌స్టాఫ్‌ను పిఒ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉన్న సంబంధిత సేవలపై సమీక్ష నిర్వహించి, అన్ని సేవలు కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్

తాగునీటికి గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి-సాలూరురూరల్

మండలంలో డెన్సరాయి పంచాయతీ పరిధిలోని గిరిజనులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధుల్లో కరెంటు దీపాలు లేక రాత్రి వేళ అంధకారంలో మగ్గిపోతున్నారు. ఈ విషయాలు సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో వెలుగుచూశాయి. బుధవారం ఆ గ్రామాన్ని సిపిఎం బృందం సందర్శించింది. పాడుబడ్డ మోటారు, పైలెట్ వాటర్ ట్యాంకు, కలుషితమైన బావి నుంచి ప్రజలు తాగునీటి అవసరాలు తీర్చుకోవడం, శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను సిపిఎం బృందం ఎదుట ఏకరువు పెట్టారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కుర్ర ఇప్పుడు మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామాల్లో సమస్యలపై కలెక్టర్ సమీక్ష చేసి, సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత మర్రి లహరి, మర్రి చిన్న, లుబ్బు, కుర్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న వాటర్‌ట్యాంకును పరిశీలిస్తున్న సిపిఎం బృందం

వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

- ఆది నుంచి రసాభాస
- పలు తీర్మానాలను వ్యతిరేకించిన సభ్యులు

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీలో బుధవారం చైర్మన్ పల్లా ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశం వాడీవేడిగా సాగింది. ప్రారంభం నుంచే సమావేశం రసాభాసగా మారింది. ప్రధాన ద్వారం దగ్గర పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి కేవలం కౌన్సిలర్లే హాజరుకావాలని షరతుపెట్టారు. దీంతో కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు, తదితరులు సిఐ చంద్రమౌళిని నిలదీశారు. 14 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారని, వారికి బదులు ప్రతినిధులుగా భర్తలు హాజరవుతున్నారని, ఇలా అడ్డుపెట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కమిషనర్ ఇచ్చిన జాబితా ప్రకారమే లోపలికి పంపిస్తున్నామని, ఏమైనా ఉంటే కమిషనర్‌తో మాట్లాడుకోవాలని సిఐ స్పష్టంచేశారు. దీంతో కమిషనర్ జయరామ్‌ను ప్రధాన గేటు దగ్గరికి పిలిచారు. ఎప్పుడూ లేని విధంగా ఇలాంటి నిబంధన పెట్టడం సరికాదని, తామంతా సమావేశానికి హాజరుకాబోమని కౌన్సిలర్లు హెచ్చరించారు కావాలనే ఏజెండాలో ఉన్న అంశాలపై ప్రశ్నిస్తామని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేయడంతో కమిషనర్ వారిని లోపలికి అనుమతించారు.

గేటు వద్ద అడ్డుకున్న కమిషనర్‌తో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అనంతరం జరిగిన సమావేశంలో డంపింగ్ యార్డు స్థలం ఎకరా రూ.18 లక్షల చొప్పున కొనుగోలు చేయడానికి గతంలోనే సమావేశం ఏర్పాటు చేశారని, దాన్ని తిరస్కరించినట్లు అప్పుడే చెప్పామని, తీరా వాయిదా వేసినట్లు మినిట్స్ బుక్‌లో రాయడం ఏమిటి కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ, కె.విజయకుమార్ నిలదీశారు. గారమ్మ కాలనీలో పైప్‌లైన్ పనులు తమకు తెలియకుండా చేశారని మండిపడ్డారు. వార్డుల్లో పర్యటిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. అక్కడ అత్యవసరం కాబట్టి దగ్గరుండి పనులు చేపట్టామని, వార్డులో పర్యటిస్తే కచ్చితంగా కౌన్సిలర్లకు తెలియజేస్తానని కమిషనర్ చెప్పారు. పట్టణంలోని వెంకటరాయుని కోనేరులో చేపల పెంపకం లీజుపై ప్రస్తావన రాగా, దాన్ని కౌన్సిలర్లు అడ్డుకున్నారు. చెరువు అభివృద్ధి చేశామని, మరల అక్కడ చేపల పెంపకానికి లీజుకు ఇవ్వడం ఏమిటని నాలుగో వార్డు కౌన్సిలర్ గంగునాయుడు, మరి కొంతమంది అడ్డుకున్నారు. డంపింగ్ యార్డు నిర్వహణకు రెండు నెలలకు లక్ష రూపాయలు ఖర్చు చేయడం పట్ల కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. డంపింగ్ యార్డుకు కొత్త స్థలాన్ని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నమయ్యకు నివాళి

ప్రజాశక్తి-సాలూరు

సంకీర్తనాచార్యులు అన్నమయ్య వర్ధంతిని బుధవారం పట్టణంలోని శ్రీసీతారామ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు ఆకుల గణపతి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు ప్రజల్లో చైతన్యం నింపాయని చెప్పారు. ఎన్ని సంవత్సరాలైనా ఆయన కీర్తనలు జనం గుండెల్లో మార్మోగుతుంటాయని చెప్పారు.

జిసిసి టెండర్లు ఖరారు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజనుల నుంచి జిసి సేకరించిన కొండచీపుర్లు, కుంకుడుకాయలు, పసుపు కొమ్ములకు బుధవారం సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టెండరు ప్రక్రియ నిర్వహించారు. టెండర్లకు 16 మంది హాజరయ్యారు. జిసిసి సేకరించిన కొండచీపుర్లను రూ.47కు టెండరు ఖరారైంది. కుంకుడుకాయలు, పసుపు కొమ్ములకు టెండర్లు ఖరారు కాలేదు. ఈ కార్యక్రమంలో జిసిసి డిఎం జి.సంధ్యారాణి, మేనేజర్లు నరసింహులు, కృష్ణ, అకౌంటెంట్ రాము, సూపరింటెండెంట్ ధర్మారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదర్శ'ంగా ఉండాలి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆదర్శ పాఠశాలలో ప్రతి విద్యార్థినీ ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ టి.సుల్తాన్ తెలిపారు. బుధవారం మండలంలోని పురోహితునివలస ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సదర్భంగా ఉపాధ్యాయులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

బల్లకృష్ణాపురంలో రీసర్వే గ్రామసభ

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామంలో రెండో విడత భూ సర్వే సందర్భంగా బుధవారం గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా హెచ్‌డిటి వి.ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం భూ సర్వే చేపట్టి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.జగన్నాథం, మాజీ సర్పంచ్ ఎన్.రామకృష్ణ, దాసరి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

సీతానగరం : మండలంలోని గెడ్డలుప్పి గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు నిర్ణీత సమయంలో పనులు చేస్తే వారికి వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు పనులు చేయాలన్నారు.

వార్షిక ప్రణాళికపై శిక్షణ

పార్వతీపురంరూరల్ : జిల్లా సమాఖ్య కార్యాలయంలో బుధవారం డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి అధ్వర్యంలో వార్షిక ప్రణాళికపై సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఎనిమిది మండలాల ఎపిఎంలు, సిసిలు, స్త్రీనిధి మేనేజర్లకు ఈ శిక్షణ ఏర్పాటుచేశారు. శిక్షణ పూర్తయిన తర్వాత క్షేత్రస్థాయిలో మొబైల్ యాప్ ద్వారా నర్సిపురం గ్రామంలో సాధన చేయించారు. కార్యక్రమంలో ఎపిడి వై.సత్యంనాయుడు, ఫైనాన్స్ డిపిఎం అప్పారావు, ఐబి సింహాచలం, ఎపిఎం శివున్నాయుడు పాల్గొన్నారు.

రూ.7.50 లక్షలకు సంత వేలం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట పంచాయతీలో డిఎల్‌పిఒ రాంప్రసాద్, సర్పంచ్ కళావతి ఆధ్వర్యాన వారపు సంత వేలం బుధవారం నిర్వహించారు. హెచ్.సంగమేష్ రూ.7.50 లక్షలకు వేలంలో కైవశం చేసుకున్నారు. రోజువారి సంత పాట టి.లక్ష్మయ్య రూ.83,500కు దక్కించుకున్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కుసిమిలో.. కుసిమి గ్రామ సచివాలయంలో బుధవారం సర్పంచ్ కూర్మారావు, డిఎల్‌పిఒ రాంప్రసాద్ ఆధ్వర్యంలో సంత వేలం నిర్వహించారు. నిమ్మక కృష్ణ రూ.1,62,800కు దక్కించుకున్నారని కార్యదర్శి రాజారావు తెలిపారు.

9వ వారం ఆదాయం రూ.2.36 లక్షలు

మక్కువ : మండలంలోని పోలమాంబ అమ్మవారి తొమ్మిదో వారం జాతర సందర్భంగా భక్తుల ద్వారా రూ.2,36,700 ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ ఇఒ వివి సూర్యనారాయణ తెలిపారు. గతేడాది ఇదే వారంతో పోలిస్తే సుమారు రూ.21 వేలు ఆదాయం పెరిగిందని తెలిపారు.

27న బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

వీరఘట్టం : బిసి కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. 92 యూనిట్లకు సంబంధించి 649 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. దరఖాస్తుదారులు ఆరోజు ఉదయం 10:30 గంటలకు ఎంపిడిఒ కార్యాలయానికి హాజరుకావాలని ఆయన కోరారు.

'తిరుమల సాయి' విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

గుమ్మలక్ష్మీపురం ం నవోదయ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటిన జియ్యమ్మవలస మండలం పెదమేరంగి తిరుమల సాయి హై స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అభినందించారు. నవోదయ ప్రవేశపరీక్షలో ఎంపికైన విద్యార్థులు, పాఠశాల సిబ్బంది గుమ్మలక్ష్మీపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆమెను కలిశారు. రానున్న రోజుల్లో క్రమశిక్షణ, నిబద్ధతతో విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుమల సాయి హై స్కూల్ అకడమిక్ డైరెక్టర్ రౌతు వెంకటరమణ ఉన్నారు.

4న వీరఘట్టం మండల సమావేశం

వీరఘట్టం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఏప్రిల్ నాలుగో తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నడుకూరులో వైద్య శిబిరం

వీరఘట్టం : మండలంలోని నడుకూరు గ్రామంలో బుధవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, చంటి పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు

సీతంపేట : సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండే కెరీర్ గైడెన్స్ ప్రణాళిక తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్రావు, రవి, కిరణ్ కుమార్, రాజు, నరేష్, తమ్మయ్య, లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్న జన్మదిన వేడుకలు

పాలకొండ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను బుధవారం టిడిపి శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. నక్కలపేటలో టిడిపి మండల అధ్యక్షులు గండి రామ్ నాయుడు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. వెంకటరమణ కోనేరు వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టిడిపి కార్యాలయంలో సీనియర్ నాయకులు సామంతులు దామోదర్ రావు, ఖండాపు వెంకటరమణ, ఆకుల మల్లేశ్వరి, గుమ్మిడి సింహాద్రి, శాసపు సర్వారావు తదితరులు కేక్ కట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-సాలూరు

పట్టణంలోని కోటవీధి జంక్షన్‌లో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ దుర్మరణం పాలైంది. రామభద్రపురం మండలం చింతలవలస గ్రామానికి చెందిన టింగలి గౌరమ్మ (47) ద్విచక్ర వాహనం వెనుక కూర్చుని వస్తుండగా కోటవీధి జంక్షన్‌లో జారి రోడ్డుపై పడిపోయింది. వెంటనే విద్యుత్ స్తంభాల లోడుతో వస్తున్న లారీ ఆమె పైనుంచి వెళ్ళింది. ఈ సంఘటనలో ఆమె శరీరం నుజ్జయింది. ఈ సంఘటనపై టౌన్ సిఐ అప్పలనాయుడు కేసు నమోదు చేశారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సబ్ ప్లాన్ (టిఎస్‌పి) ప్రాంత అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫకేషన్ విడుదల చేసిందని జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖాధికారి టి.కనక దుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, సీతంపేటలోని ఐటిడిఎ పరిదిలోని ట్రైబల్ సబ్‌ప్లాన్ ఏరియాల్లో 9 అంగన్వాడీ వర్కర్లు, 15 హెల్పర్లు, 12 మినీ అంగన్వాడీ కార్యకర్తల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినట్టు చెప్పారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ నాలుగో తేదీలోగా సంబంధిత ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

పార్వతీపురం డివిజన్‌లో పార్వతీపురం మండలం విఆర్‌పేట కేంద్రంలో అంగన్వాడీ వర్కర్-1, హెల్పర్-1, మినీ అంగన్వాడీ కార్యకర్త -1, కొమరాడలో మినీ అంగన్వాడీ కార్యకర్త -2, సాలూరులో అంగన్వాడీ వర్కర్-2, సహాయకులు-2, మినీ అంగన్వాడీ కార్యకర్త-2, పాచిపెంటలో అంగన్వాడీ వర్కర్-1, సహాయకులు-5, మినీ అంగన్వాడీ కార్యకర్త -5, మక్కువలో అంగన్వాడీ వర్కర్ -3, సహాయకులు- 1, పాలకొండ డివిజన్‌లో కురుపాంలో అంగన్వాడీ వర్కర్-1, సహాయకులు-1, జియ్యమ్మవలసలో అంగన్వాడీ సహాయకులు-2, భద్రగిరి, గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీ వర్కర్-1, సహాయకులు-2... మొత్తం 34 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

పార్వతీపురం మండలం విఆర్‌పేట అంగన్వాడీ వర్కర్ పోస్టు ఒసికి, సీతంపేట మినీ అంగన్వాడీ వర్కర్ పోస్ట్ ఎస్‌టి, చినబొండపల్లి అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు బిసి-డి, బాలగొడబ-2 కేంద్రంలో హెల్పర్ ఎస్‌సి, తాడంగివలస మినీ అంగన్వాడీ వర్కర్ ఎస్‌టి, బట్టిమునగవలస మినీ అంగన్వాడీ వర్కర్ ఎస్‌టి, కురుకుట్టి అంగన్వాడీ కేంద్రం-1లో హెల్పర్ ఒసి, దత్తివలస అంగన్వాడీ వర్కర్ బిసి-ఎ, ఎగువమీనాడంగి అంగన్వాడీ హెల్పర్ ఎస్‌టి, చిన్న ఊటగెడ్డ అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్ ఒసి, ఎం.కొత్తవలస మినీ అంగన్వాడీ కేంద్రంలో వర్కర్ ఎస్‌టి, బందనల్ మినీ అంగన్వాడీ కేంద్రంలో వర్కర్ పోస్ట్ ఒసి మహిళలకు కేటాయించినట్లు వివరించారు. పోస్టుల భర్తీకి, రద్దు చేసేందుకు కమిటీ చైర్మన్ కు పూర్తి అధికారం ఉందని చెప్పారు.

అర్హతలు

అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు 21-35 ఏళ్ల వయస్సు, ఎస్‌సి, ఎస్‌టి కేంద్రాలకు ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీకి రోస్టర్‌లో నమోదైన పోస్టులకు 21 ఏళ్లు నిండిన అభ్యర్థులు లేదా, 18 ఏళ్లు నిండిన వారు అర్హులని పీడీ పేర్కొన్నారు. పదో తరగతి ఉతీర్ణులై ఉండాలని చెప్పారు. పదో తరగతి పాసైన అభ్యర్థి లేకపోతే దరఖాస్తు చేసిన వారిలో ఉన్నత తరగతి పాసైన అభ్యర్థి దరఖాస్తును పరిశీలిస్తామని తెలిపారు. స్థానికంగా నివాసం ఉన్న వివాహిత మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో 6 అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం ఐసిడిఎస్ పిఒ కె.విజయగౌరి నియామక పత్రాలను అందజేశారు. పిఎం జన్‌మన్‌లో చింతమానుగూడ, ఇప్పమానుగూడ, తిత్తిపాయిగూడ, పీరంగూడ, తీయాలిగూడ, ఇప్పలగుడ్డి గ్రామాల్లోని అంగన్వాడీ సహాయకుల పోస్టులను భర్తీచేశారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమాలు గూర్చి అవగాహన కల్పించారు.

ముగిసిన శిక్షణ

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు మేధాశక్తి ప్రేరణకు కార్యకర్తలు కృషి చేయాలని సిడిపిఒ కె.విజయగౌరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ బి, పడాయి బిపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరి, శ్రావణి, భాగ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదంకలాం పిహెచ్‌సి సందర్శన

వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ జగన్‌మోహనరావు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు మెరుగు పడేందుకు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలు, వైద్య పరీక్షలు, చికిత్స వివరాలు రికార్డులో పరిశీలించారు. ప్రతిఒక్కరి ఆరోగ్య సమస్యలు స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అత్యవసర సమయంలో ప్రాథమిక చికిత్సకు అవసరమైన ఇంజక్షన్లు, మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. నిర్ధారణ పరీక్షలు చేపడుతున్న విధానం, ల్యాబ్ పరికరాల పనితీరు తీరుపై ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు. మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్ల లభ్యత పరిశీలించారు. పిహెచ్‌సిలో ప్రసవాలపై ఆరాతీశారు. సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిలో జరిగేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. పిహెచ్‌సిలో పవర్ బ్యాకప్, బ్యాటరీ పనితీరుపై అడిగి తెలుసుకున్నారు.

అనంతరం వైద్య సిబ్బందితో సమీక్షించి ఆరోగ్య కార్యక్రమాల ప్రగతి నివేదికలను పరిశీలించారు. మాతా శిశు సేవలు నిర్ణీత సమయంలో అందేలా చూడాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేసి, వివరాల నమోదు పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య శాఖ నిర్దేశించిన సమయానికి ఎన్‌సిడి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో డ్రైడే కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. అన్ని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, డీహైడ్రేషన్, వడదెబ్బ జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.రమ్యసాయి, సూపర్వైజర్లు వరలక్ష్మి, గోపి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే జగదీశ్వరి

గిరి ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - కురుపాం,గుమ్మలక్ష్మీపురం

మారుమూల గ్రామాల గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోరండంగూడ, తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదగూడ గ్రామాల్లో బుధవారం గిరి ఆరోగ్య కేంద్రాలను ఆమె ప్రారంభించారు. గిరి ఆరోగ్య కేంద్రాల సేవలను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశాలు ప్రకారం డిఎంహెచ్‌ఎం భాస్కరరావు గుమ్మలక్ష్మీపురం మండలానికి రెండు అంబులెన్స్‌లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ కె.వి.ఎస్ పద్మావతి, వైద్యులు బుద్దేశ్వరరావు, ప్రజ్ఞ, అభిలాష్, ఎంపిడిఒలు ఉమామహేశ్వరి, సాల్మన్‌రాజ్, గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ ఎన్.శేఖర్, మండల అధ్యక్షులు కొండయ్య, సుదర్శన్ రావు, సర్పంచులు పత్తిక అంజలి, బిడ్డిక రాజారావు, నాయకులు కోలా రంజిత్ కుమార్, రమణమూర్తి, రంజిత్ కుమార్ నాయకో, లోకనాథం, సుబ్బలక్ష్మి, భూషణ్ రావు, భారతమ్మ, కళావతి, నరేష్, వెంకట్రావు, దాసు, ధర్మారావు పాల్గొన్నారు.

అడారుగెడ్డ ప్రాజెక్టు పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

అడారుగెడ్డ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర తెలిపారు. బుధవారం అడారు పంచాయతీలోని అడారుగెడ్డపై అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రాజెక్టును బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడారుగెడ్డ ఆయకట్టు 600 ఎకరాలు ఉందని, గత ప్రభుత్వం పూర్తి చేయాల్సింది పోయి రైతులను మోసం చేసే పరిస్థితికి తీసుకొచ్చిందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పనులను 2004లో ప్రారంభించారని, ఇంతవరకు మోక్షం లేకుండా పోయిందని చెప్పారు. 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం భూసేకరణకు ముందడుగు వేసిందన్నారు. ఈ ప్రాజెక్టుపై సంబంధింత మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు.

సచివాలయంలో తనిఖీలు

డికెపట్నం సచివాలయాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయానికి వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే విధుల్లో ఉన్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటోలు పెట్టకపోవడాన్ని అయిన తప్పుబట్టారు. ఇక్కడి ఉద్యోగులంతా నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కంప్యూటర్‌కు కనెక్టివిటీ లేదని, ప్రింటర్ సదుపాయం లేదని ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం నుంచే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, గైర్హాజరు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

డిఎస్‌పి రాంబాబు

క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న డిఎస్‌పి రాంబాబు

ప్రజాశక్తి - కురుపాం

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహద పడతాయని, యువత చదువుతోపాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపాలని డిఎస్‌పి బి.రాంబాబు సూచించారు. మండలంలో నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు ఆధ్వర్యంలో బుధవారం ధర్మలక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలన్నారు. వీటన్నిటికీ శారీరక ఆరోగ్యం కూడా అవసరమని చెప్పారు. క్రీడల పట్ల కూడా యువత ఆసక్తి చూపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్విన్‌పేట సిఐ హరి, ఎస్ఐలు పి.నారాయణరావు, శివ ప్రసాద్, ట్రెయినీ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం పరిశీలన

మండలంలో ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం డిఎస్‌పి బి.రాంబాబు సందర్శించారు. కేంద్రం సమీపంలో 144 సెక్షన్ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎ.నీలకంఠరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ అంగన్వాడీ స్థలం స్వాధీనం

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురంలో పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో తమకు హక్కులున్నాయంటూ కొంతమంది.. అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మించడానికి అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి, రెవెన్యూ, పోలీస్ అధికారులు కలిసి ఐసిడిఎస్ పిఒ శ్రీనివాసరావుకు స్థలాన్ని అప్పగించారు. గతంలో అంగన్వాడీ భవనానికి ఐసిడిఎస్ అధికారులు గ్రామ పంచాయతీకి చెందిన స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో గ్రామసభ నిర్వహించి స్థలానికి ఎవరూ అభ్యంతరాలు తెలపకపోవడంతో అంగన్వాడీ కేంద్రానికి కేటాయిస్తూ తీర్మానించారు. ఈలోగా గ్రామానికి చెందిన బండారు అప్పలనాయుడు కుటుంబీకులు ఆ స్థలం తమదంటూ అడ్డుగా సిమెంట్ స్తంభాలను నిర్మించి, కంచెను ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఐసిడిఎస్ అధికారులకు స్వాధీన పరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం అన్ని శాఖల అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఆ స్థలంలో ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌ను కార్మికులతో తొలగిస్తుండగా అప్పలనాయుడు కుటుంబీకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈలోగా పోలీసులు జోక్యం చేసుకుని, వారిని లాక్కెళ్లారు. అనంతరం స్థలాన్ని ఐసిడిఎస్ పిఒకు అప్పగించారు. త్వరలోనే పనులు ప్రారంభించి అంగన్వాడీ కేంద్రాన్ని నిర్మిస్తామని పిఒ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సంతోషికుమారి, ఆర్ఐ, విఆర్ఒ పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అభ్యుదయ రైతు పురస్కారం

పురస్కారం అందుకుంటున్న రైతు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బలిజిపేట

మండలంలోని మిర్తివలస గ్రామ పరిధిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న డాక్టర్ శంబంగి శ్రీనివాసరావు అనే రైతుకు అభ్యుదయ రైతు పురస్కారం లభించింది. ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో ప్రకృతి సాగు రైతులకు ఉగాది పురస్కారాలు, ప్రకృతి రైతుల సదస్సులో అభ్యుదయ రైతు అవార్డు పురస్కారాన్ని అందించి, సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ, నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తున్న రైతు శ్రీనివాసరావును రైతు ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ వెంకటేశ్వరరావు, ఎమ్‌పి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే రాజగోపాల్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం బలిజిపేట మండల ఇన్‌ఛార్జి లక్ష్మీ తిరుపతరావు, రైతు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

ఉపాధి బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఉపాధి హామీ కూలీలకు 10 వారాలకు బిల్లులు చెల్లించలేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు అధికారులను కోరారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో అధికారులకు ఆయన వినతి అందించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలు పని చేసిన 14 రోజుల్లోపు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. రెండు పూటల పనిని రద్దు చేసి, ఒకే పూట చేయించాలని డిమాండ్‌చేశారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి రూ.600 చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు తావు లేకుండా సక్రమంగా చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ ఆడిట్ పకడ్బందీగా చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాడంగి సన్నం, మరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

27న తాగునీటి సమస్యపై ధర్నా

ప్రజాశక్తి-వీరఘట్టం

తాగునీటి సమస్య పరిష్కారానికి ఈ నెల 27న సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఎన్.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. మేజర్ పంచాయతీ పరిధిలో 14,315 మంది నివాసముంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించకపోవడంతో గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంచాయతీలో ఎప్పటికప్పుడు కాలువలో పూడికలు తొలగించకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లి, ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. సిసి రహదారులకు ఇరువైపులా కాలువలు నిర్మించక పోవడంతో వాడుక నీరంతా రహదారిపైకి చేరుతోందని చెప్పారు. ఈ సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

నివాసాల సమీపంలో అంత్యక్రియలు

తహశీల్దార్‌కు దళితుల ఫిర్యాదు

ప్రజాశక్తి-సీతానగరం

తమ నివాసాల సమీపంలో మృతదేహాన్ని ఖననం చేయడంపై అనంతరాయుడుపేట గ్రామ దళితులు తహశీల్దార్‌కు బుధవారం ఫిర్యాదుచేశారు. గ్రామంలో పోల పైడమ్మ మరణించడంతో ఆమె కుటుంబీకులు వారి ప్రయివేటు స్థలంలో ఖననం చేసేందుకు వచ్చారని తెలిపారు. అది తమ ఇళ్లకు సమీపంలోనే ఉందని, దూరంగా ఖననం చేసుకోవాలని కోరామని దళితులు చెప్పారు. దీంతో గ్రామస్తులంతా దౌర్జన్యం చేస్తూ అక్కడే ఖననం చేశారని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను దళితులు రాయిపల్లి సింహాచలం, రాయిపల్లి తౌడు, రాయపల్లి గౌరి, రాయిపల్లి రాము, రాయిపల్లి రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-కొమరాడ

గ్రామాల్లో గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని హౌసింగ్ ఇఇ జి.సోమేశ్వరరావు తెలిపారు. కొమరాడ మండల కేంద్రంలో చేపడుతున్న గృహ నిర్మాణాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో నిలిచిపోయిన గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. బిసిలకు రూ.50 వేలు, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.75 వేలు చొప్పున సాయం అందిస్తున్నట్లు చెప్పారు. పనులు చేసిన వెంటనే పాత బిల్లులు పెండింగ్‌తో పాటు ప్రభుత్వం అదనంగా కేటాయించిన డబ్బులను కూడా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ డి.రాములు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ఆప్కాస్‌ను కొనసాగించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆప్కోస్‌ను రద్దు చేస్తామని ప్రభుత్వం మంత్రిమండలి సమావేశంలో నిర్ణయించిందని, అలాంటప్పుడు దానికన్నా మెరుగైన వ్యవస్థ తీసుకురావాలని చెప్పారు. అలా చేయకుండా కార్మికులందరినీ కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టి బలిపశువులు చేస్తామంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాముడు, కార్యదర్శి శంకర్రావు, నాయకులు భాస్కర్, లక్ష్మి, జన, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నియంత్రణే లక్ష్యం

ప్రజాశక్తి-సీతంపేట

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ జైభీమ్

నాటుసారా నియంత్రణే లక్ష్యంగా నవోదయం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సిఐ జైభీమ్ తెలిపారు. మండలంలోని అడ్డాకుల గూడ, సీతంపేట సచివాలయంలో బుధవారం అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తాగటం వల్ల ఏర్పడే అనర్థాలపై వివరించారు. సారా అమ్మకాలు, తయారు చేస్తూ పట్టుబడిన వారికి విధించే శిక్షల తీవ్రతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కె.సరస్వతి, అడ్డాకులగూడ, సీతంపేట సర్పంచులు సవర సిమ్మయ్య, ఆరిక కళావతి, ఎంపిటిసిలు హరిప్రసాద్, పగడాలమ్మ, వైస్ సర్పంచ్ బృందావతి, కార్యదర్శులు చిన్నారావు, రామకృష్ణ, విఆర్ఒ అరుణ్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

In the file of the Honourable Court of the Senior Civil Judge Court at Parvathipuram
E.P. No.8/2022, O.S.57/2015, F.D.I.A. No: 2/2019

Between:
Sarika Chandrasekhar ... Petitioner/DHr
And:
Pilli Kamaraju and 5 others...Respondents/JDRs
To
R-4: Pilla Devi, D/o late Kamaraju, aged 27 years, Door No.2-154, Gadi Street, Parvathipuram Town and Municipality, Now Parvathipuram Manyam District.

Take notice that the E.P. filed by the petitioner / DHr against respondents 1 to 6, you are the 4th respondent in the above case. The Honourable Court passed the Decree against JDRs in E.P. No.8/2022, O.S.57/2015, F.D.I.A. No: 2/2019 of Honourable Court of the Senior Civil Judge Court at Parvathipuram has been posted to **04.04.2025** for your appearance before Honourable Court the above matter is posted at **10:30 A.M.** Parvathipuram Senior Civil Judge Court.

Take notice that if you fail to attend before the court on that day above mentioned either in person or through an authorize person, the E.P. will be heard and determined in your absence.

// By order of the Court //

N.RAJESWARA RAO,
Advocate,
PARVATHIPURAM.

Dt:24.3.2025
Parvathipuram